
# షూటింగ్

-గోటేటి జగన్మోహనరావు



ప్రకాశరావు ఈవేళ ఎంత హుషారుగా వుండాలంటే అంత హుషారుగా వున్నాడు. ప్రొద్దుటే లేచి ఆరున్నరకే టాయిలెట్ అయి కూర్చున్నాడు. తన ముఖాన్ని అద్దం ముందు నాలుగైదు సార్లేనా చూసుకుని, ఇరవై సార్లేనా దువ్వుకున్నాడు తల.

ఇంతకీ,ఎందుకింత హుషారుగా వున్నాడో చెప్పలేదు కదూ! తన బి.కాం క్లాస్‌మేట్, తన బెస్ట్ ఫ్రెండ్, ఇంకా చెప్పాలంటే- సినీ విలన్ అయిన మధు తన వూరు, షూటింగ్‌కి వస్తున్నాడు. తనకీ విషయం నిన్నే తెల్సింది. తెల్సినప్పటినుంచీ మధుని ఎప్పుడు చూస్తానా, మధుకి తన కోరిక ఎప్పుడు చెప్తానా అని ఎదురు చూస్తున్నాడు.

ఈ ఊర్లో షూటింగ్ తీయడం ఇదే ప్రథమం అని చెప్పవచ్చు. సమయం తొమ్మిదవుతోంది. అప్పటికే సినిమా వాళ్ళ కార్లు,మనుషులు ఒక్కొక్కళ్ళూ దయచేస్తున్నారు.

షూటింగ్ 'ప్లేస్' లంక చేలల్లో పెట్టారు. అన్నీ జొన్న చేలు, జనపచేలూను. చాలా బాగుంది ప్లేస్.

పల్లెటూరు కదా! జనమంతా పరుగు పరుగున వచ్చేస్తున్నారు. సినిమా యాక్టర్లని చూడాలని, పడుతూ, లేస్తూ ఆడాళ్ళు కూడా వస్తున్నారు.

ప్రకాశరావు కూడా అందరి కన్నా ముందే వెళ్ళి కూర్చున్నాడు. అప్పుడే కారు దిగి, నడిచి వస్తున్నాడు సినీ విలన్ మధు. ప్రకాశరావు ఆనందానికి అంతులేదు. 'ఎన్నాళ్ళయింది మధుని చూసి? అప్పుడే ఎంత మారిపోయాడు!' తను చదువుకొనే రోజుల్లో కొంచెం సన్నగా వుండేవాడు' అలాంటిదిలావుగాతయారయ్యాడు'

'ఎప్పుడు మాట్లాడేద్దామా వెళ్ళి' అనుకున్నాడు. 'తనని గుర్తుపడతాడా?' అప్పుడే ఓ సందేహం తళుక్కున వచ్చింది.

'అబ్బే? వాడు మారినా, నేనేం మారలేదుకదా, ఈజీగా గుర్తుపట్టేస్తాడు' అనుకున్నాడు వెంటనే.

అప్పుడే మధు చుట్టూవారా జనం ఆవరించేశారు. స్టూడెంట్స్ కొందరు వెళ్ళి ఆటోగ్రాఫ్ తీసుకుంటున్నారు. అందరూ మాట్లాడేస్తున్నారు వెళ్ళి. కాని, తను మాత్రం వెళ్ళలేక పోతున్నాడు. కారణం- జనాన్ని గెంటుకుంటూ తను వెళ్ళలేడు. పైగా, పోలీసాళ్ళు వున్నారన్న మాటేగాని, వాళ్ళు అప్పుడే వచ్చిన హీరోయిన్‌ని చూస్తూ కూర్చున్నారు.

ఎలాగైతేనేం జనాన్ని మెల్లిగా చీల్చడం మొదలెట్టాడు. జనం మధ్య నలిగాడన్న మాటేగాని, మధుకి దగ్గరగా వెళ్ళిపోయాడు.

"హల్లో మధూ!" అంటూ పలకరించాడు.

మధు క్షణం ఆశ్చర్యంగాచూసి, "ఎవరు మీరు?" అని అడిగాడు.

ప్రకాశరావు మధు మాటలకి నివ్వెరపోయి కాస్త సిగ్గుపడ్డాడు. ప్రక్కనున్న జనం తనని వింతగా చూస్తుంటే—

"నేను, నీ క్లాస్‌మేట్ ప్రకాశరావుని" తనని తానే పరిచయం చేసుకున్నాడు.

"ఉఁహూం. అలాగా! ఏం చేస్తున్నావ్?" అడిగాడు చిన్న నవ్వు పెదవులపైకి తెచ్చుకుంటూ.

తనని కాస్త వెంటనే గుర్తుపట్టినందుకు సంతోషపడి, "స్టేట్ బ్యాంక్‌లో జాబ్ చేస్తున్నాను" అన్నాడు.

మధు "బాగుంది" అని, ఇంతలో "షాట్, రెడీ!" అంటూ వచ్చిన

అసిస్టెంట్ డైరెక్టర్‌తో వెళ్ళి పోయాడు.

ప్రకాశరావుకి అసిస్టెంట్ డైరెక్టర్ మీద ఎంత కోపమంటే అంత కోపం వచ్చింది- తనతో మాట్లాడుతున్న మధుని తీసుకు పోయినందుకు.

మళ్ళీ అంతలోనే తన కోపాన్ని నిగ్రహించుకొన్నాడు 'షాట్' ఓ.కె అయ్యాక మాట్లాడవచ్చని.

అంతా తను వింటున్న చోటు నుంచి, షూటింగ్ జరుగుతున్న చోటుకి పరుగెత్తారు.

తనూ, గబగబా వెళ్ళి చూస్తు న్నాడు.

షూటింగ్ తీయడం మొదలు పెట్టి ముప్పై నిముషాలైంది.

ఈ ముప్పై నిముషాల్లోనూ ఓ ఇరవై 'ఓకులు' తిన్నాడు మధు.

'ఆఫ్టాల్! హీరోయిన్‌ని గట్టిగా పట్టుకోడానికి మధుగాడు అంతసేపు చేస్తాడేమిటి? తనే విలన్ అయితే ఒకే షాట్‌తో ఓ.కె అని పించుకుందు'నని అనుకుంటూ ప్రకాశరావు ఉబలాటపడ్డాడు. మళ్ళీ డైరెక్టర్ ఏవో సూచన లిచ్చి, "షాట్ రెడీ!" అన్నాడు.

హీరోయిన్ చెరుకు ముక్క తింటూ, నెత్తిమీద వున్న గంపను వయ్యారంగా ఊపుతూ వస్తోంది. ఇంతలో మధు వెళ్ళి హీరోయిన్‌ను అమాంతంగా పట్టుకొని, రేప్‌చేయ బోయాడు.

ఇంతలో, "ఓకె" అన్నాడు డైరెక్టర్, తన సంతృప్తిని ప్రకటిస్తూ.

మధు పెద్ద బరువు వదిలినట్టు "హమ్మయ్య!" అనుకొంటూ వచ్చి కూర్చున్నాడు చూపించిన చైర్‌లో.

ఇంతలో మళ్ళీ జనం మూగు తున్నారు చుట్టూ.

ప్రకాశరావు గబగబా జనాన్ని మళ్ళీ చీల్చుకొంటూ వెళ్ళాడు.

మధు, ప్రకాశరావుని చూచీ చూడనట్టు ముఖం ఆ ప్రక్కకి తిప్పేసుకుని, హీరోయిన్‌తో ఏదో గుసగుసలాడుతున్నాడు.

ప్రకాశరావుకి మధు మీద పీక దాకా వచ్చింది కోపం. కోపం అణుచుకొని ధైర్యం తెచ్చుకొని, "ఏరా మధూ!" అన్నాడు.

మధు ఆ పిలుపుకి పలక లేదు. మళ్ళీ పిలుపుకి పలికి, కుర్చీ చూపిం చాడు కూర్చోమని.

ప్రకాశరావు పోజు కొడుతూ, మధుకి హీరోయిన్‌కి మధ్య నున్న కుర్చీలో కూర్చున్నాడు.

మళ్ళీ మధు హీరోయిన్‌తో

మాట్లాడుతున్నాడు ప్రకాశరావుని మర్చిపోయినట్లుగా.

ప్రకాశరావుకి బోర్‌కొట్టి వాళ్ళ దరి సంభాషణలోనూ తనూ జోక్యం చేసుకోవడం మొదలెట్టాడు.

కాస్సేపున్న తర్వాత తనకు తానే పరిచయం చేసుకొన్నాడు హీరోయిన్‌కి, మధు చేయకపోవడంతో విసుగెత్తి.

"మా కాలేజీ రోజుల్లోనే ఎంతో హాయిగా వుండేవాళ్ళం. ఇప్పుడు నేను ఉద్యోగంలోపడ్డాను, మా మధుగాడు ఈ సినిమాల్లో పడ్డాడు. అప్పుడున్నంత స్వేచ్ఛ ఇప్పుడు ఒక్క క్షణం కూడా వుండదు హీరోయిన్‌గారూ!" అని "ఏరా మధూ! నిజం కదూ?" అన్నాడు ప్రకాశరావు మధు వైపు చూస్తూ.

మధు తప్పదన్నట్టు చిన్న నవ్వు నవ్వి "నిజమే!" అన్నాడు.

హీరోయిన్ మాత్రం మాట్లాడలేదు. నవ్వి ఊరుకొంది.

మళ్ళీ కాస్సేపటికి షాట్ రెడీ అయ్యింది.

ఈ షాట్ ఓ అరగంటకి ఓ.కె. అయ్యింది.

ఈ షాట్‌లో మధుతో తీసే షాట్స్ పూర్తవ్వడంతో, మధు మద్రాస్ వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు నిర్మాత దగ్గర, డైరెక్టర్ దగ్గర శెలవు తీసుకొని.

మధు కారు ఎక్కడానికి మెల్లిగా నడిచి వస్తుంటే ప్రకాశరావు ఇదే సమయమనుకొని కూడా పడ్డాడు.

"ఇక్కడ నీ మీద తీయవలసిన షూటింగ్ అయిపోయిందా?" ప్రకాశరావు, మధువెంట నడుస్తూ అడిగాడు.

"ఆఁ అయిపోయింది. అందుకే వెళ్ళిపోతున్నాను" అన్నాడు మధు. కాస్సేపున్న తర్వాత అన్నాడు ప్రకాశరావు "ఏరా? ఎన్ని లెటర్స్ వ్రాస్తున్నా, రిప్లయి ఇవ్వవేం?" అని.

మధు ఓ నవ్వువిసిరి, "అయామ్ సారి, ఖాళీలేక" అన్నాడు ప్రకాశరావు భుజంమీద చెయ్యివేసి.

మధు తన మీద చేయి వేయడంతో, ఐస్అయిన ప్రకాశరావు, "పర్వాలేదు,ఇకముందైనా ఇయ్యి!" అన్నాడు.

అలా మాట్లాడుకుంటూ కారు దగ్గరకి వచ్చేశారు. ప్రకాశరావు మాత్రం తనకు తానుగా తన విషయం చెప్పుకోవడానికి సిగ్గుపడ్డాడు.

మధు, ప్రకాశరావు దగ్గర శెలవు తీసుకొని కారు ఎక్కేశాడు.

కారు కాన్వెంట్‌లోనే వెళ్ళిపోతుంది.

తన కోరిక మాత్రం చెప్పలేక పోతున్నాడు. ఏది ఏమైనా చెప్పేద్దా మనుకున్నాడు.

కాని, చెప్పలేకపోతున్నాడు. అసలే ప్రకాశరావుకి ఎంతో సిగ్గు. అందులోనూ కారులో పెద్ద పెద్ద వాళ్ళంతా ఉండడంతో ఇంకా ఎక్కువైంది సిగ్గు.

ఏమైనాసరే చెప్పేయాలనుకొని ధైర్యం కూడా తెచ్చుకొని, వణకు తున్న హృదయాన్ని గట్టిగా పట్టు కుని-

"ఒరే మధూ!" అన్నాడు.

ప్రక్కనున్న ఆయనతో మాట్లాడుతున్న మధు ప్రకాశరావు మాటలు వినిపించుకోలేదు.

డ్రైవర్ ఇంజన్ స్టార్టుచేశాడు. ప్రకాశరావు హృదయం నీరై పోయింది.

"ఒరే మధూ!" మళ్ళీపిల్చాడు.

మధు ప్రకాశరావువైపు తిరిగి- "వెళ్ళగానే లెటర్ వ్రాస్తానుగా!" అన్నాడు.

అప్పటికే కారు ముందుకి పోవడంతో, ప్రకాశరావు ఉసూరు మంటూ ఇంటికి వచ్చేశాడు- ఇక అక్కడ వుండలేక.

ఇంటికి వచ్చాడన్న మాటేగాని మనసు మనసులా లేదు.

ఆ మర్నాడే తన బలమైన కోరికను, మధుకి చెప్పలేకపోయిన విషయాన్ని, మధుకి లెటర్‌లో రాసేశాడు.

ఓ నెలరోజులకి జవాబు వచ్చింది కాని, తన విషయం గురించి అసలు అందులో ఒక్క అక్షరం ముక్క కూడా లేకపోవ డంతో ప్రకాశరావుకి మహా పిచ్చెక్కిపోయింది.

వెంటనే శలవు పెట్టేశాడు. రెండువందలు చూసుకొని మద్రాసు వెళ్ళిపోయాడు.

అడ్రసు ప్రకారం మధు ఇంటికి వెళ్ళాడు.

పెద్ద మేడ, చాలా బాగుంది. ఇంటి ముందువున్న గూర్ఖాని అడి గాడు- 'మధు ఇంట్లో వున్నాడా?' అని.

ముందు గూర్ఖా జవాబు చెప్ప లేదు. ఓరూపాయి చేతిలో పెడితే, "లోపల వున్నారు" అని చెప్పాడు.

ప్రకాశరావు కొండంత ఆశతో ఆనందపడి, వెంటనే తన అడ్రసు రాసి ఓ స్లిప్ ఇచ్చాడు గూర్ఖాకి, మధుకి చూపించమని.

గూర్ఖా ఆ స్లిప్ తీసుకుని లోప లికి వెళ్ళాడు.

'తన అడ్రస్ చూడగానే, మధు అన్నం తింటున్నాసరే,

నిద్రపోతున్నా సరే ఎగిరి గంతేసి వచ్చి, అమాంతంగా తనని కౌగలించుకొని, లోపలికి తీసుకు వెళతాడని' అనుకుంటున్నాడు ప్రకాశరావు.

కాని తన ఆశ అడియాసయింది. లోపల్నించి వచ్చిన గూర్ఖా "అయ్యగారు లేరు" అన్నాడు పెద ముఖం పెడుతూ.

ప్రకాశరావు నీరసపడిపోయి, "ఇప్పుడేకదా, వున్నారని చెప్పావ్. ఇంతలోనే ఎక్కడికి వెళ్ళిపోయాడు?" అన్నాడు.

గూర్ఖా చెప్పిన సమాధానంలో ఉన్న ఆంతర్యం బోధపడలేదు ప్రకాశరావుకి.

అలాగ మధూయే చెప్పించాడేమో అనుకొన్నాడు.

'ఛ! మధు అలాంటివాడు కాదు' అంతలో మళ్ళీ అనుకొన్నాడు.

"అది అంతే బాబు! వెళ్ళిపోండి! అందర్నీ లోనికి రమ్మనరు" అన్నాడు గూర్ఖా.

అప్పుడర్థమయింది, తనకు అంతే.

'ఎలాగయినా, మధుకి తను వెళ్ళి చెప్పాలి! చెప్పితే! కాదనడు మధు. కాని, లోపలికి వెళ్ళండం ఎలాగ?'

వెంటనే తళుక్కున మెరిసింది ఓ ఆలోచన.

* * *

మధు ఇంటిముందు, ఓ అంబాసిడర్ కారు ఆగింది.

గూర్ఖా పరుగెత్తుకుంటూ వచ్చాడు.

ప్రొడ్యూసర్ రంగారావు మెల్లగా దిగాడు కారులోంచి.

"మధూ, వున్నారా?" నెత్తిమీద వున్న టోపీ సవరించుకుంటూ అన్నాడు ప్రొడ్యూసర్.

"ఆఁ వున్నారు బాబూ! తమ.... పేరు...."

"ప్రొడ్యూసర్ రంగారావు!"

ఆ మాట నాలుగుసార్లు అనుకుంటూ లోపలికి పరుగెత్తాడు గూర్ఖా. వెంటనే మధు గబ గబా వచ్చేశాడు- కారు దగ్గర నిలబడి వున్న ప్రొడ్యూసర్ దగ్గరికి.

"మీరు, ప్రొడ్యూసర్ రంగారావు కదూ!" తనకు ఆ రంగారావు అసలు తెలియక పోయినా, గూర్ఖా ఇచ్చిన పేరు ప్రకారం అడిగేశాడు.

"ఆఁ అవును, మీకోసమే వచ్చాను. ఓ పిక్చర్ తీస్తున్నాను. కాల్‌షీట్ గురించి వచ్చాను."

మధు ఆనందానికి అంతులేదు. అప్పటికి నెలరోజులనుంచి ఒక్క-పిక్చర్‌కి కూడా తను 'బుక్' అవ్వలేదు. కారణం.... మొన్న మొన్నే ఫీల్డ్‌లోకి వచ్చిన 'రాజా' తనని, నొక్కేశాడు. నిర్మాతలంతాఇప్పుడు ఆ రాజా వెంటపడుతున్నారు.

"బయటే నిలబడిపోయారు, రండి లోపలికి వెళ్దాం" చేయిపట్టుకుని మరీ తీసుకెళ్ళాడు ఇంట్లోకి. వెంటనే వద్దన్నా టిఫిన్, కాఫీ తెప్పించేశాడు.

రంగారావు తృప్తిగా తినేసి, సిగరెట్ వెలిగించాడు.

"అవునూ! ఈ వేళ మీరు షూటింగ్‌కి వెళ్ళలేదా? ఖాళీగా వున్నారు?" అడిగాడు రంగారావు పొగవదుల్తూ.

మధు చిన్న ముఖం చేసుకుని, "నెల రోజులనుంచి ఒక్క పిక్చర్‌కి కూడా నేను బుక్ అవ్వలేదు, ఇంతకుముందు నిర్మాతలు మా ఇంటిముందు 'క్యూ'లో నించునేవారు 'కాల్‌షీట్సు'కి. ఈ మధ్య ఆ 'రాజా'గాడు వచ్చాడు చూశారా, అప్పటినుంచీ నాకు ఒక్క-'బుకింగ్' కూడా రావటంలేదు. నిర్మాతలంతా వాడినే పట్టుకుని వ్రేలాడుతున్నారు. మీలాంటి తెలివున్న నిర్మాతలు మాత్రం నాలాంటి మంచి నటులకోసం వెతుకుతున్నారు. ఇంతకీ మన చిత్రం పేరేమిటి?" అన్నాడు.

మధు ప్రసంగం అంతా విన్న ప్రొడ్యూసర్ రంగారావు వేషంలో వున్న ప్రకాశరావు నీళ్ళు గుటకేశాడు.

'నాకో వేషం ఇప్పించి, నన్ను కూడా సినీఫీల్డుకి పరిచయం చెయ్యి' అని, తన బలమైన కోరికను చెప్పాలనుకున్నాడు ప్రకాశరావు.

అందుకే తను ఇంత డబ్బు ఖర్చుపెట్టి, ఇన్ని పాట్లు పడి, ప్రొడ్యూసర్ వేషంలో వచ్చాడు. అలాంటిది మధుకే ఇప్పుడు వేషం కావాల్సివచ్చి, తనని పట్టుకున్నందుకు బాధపడ్డాడు.

"ఏమిటి రంగారావుగారు ఆలోచిస్తున్నారు? మీరు కూడా ఆ 'రాజా'గాడ్ని బుక్‌చేయరుగా! విలన్ పాత్ర ఇవ్వకపోయినా, ఓ చిన్న పాత్రైనా నాకు పడేయండి! మీకు ఎంతైనా పుణ్యం వుంటుంది. ప్రస్తుతం నాకో చిన్న పాత్ర కావాలి!" అంటున్న మధుని చూసి, తనకేం చెప్పాలో అర్థం కాలేదు ప్రకాశరావుకి. *